'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# పొలాల్లో మృత్యుఘోష

**తెలంగాణ** ఆవిర్భావ అనంతరం అభివృద్ధి పథంలో అగ్రగామిగా దూసుకువెళ్లిన రాష్ట్రంలో ప్రస్తుతం నిరాశా నిస్పృహలు చోటుచేసుకుంటున్నాయి. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో సాగు సన్నగిల్లడం, పంటలు ఎండిపోవడం ఆందోళన కలిగిస్తుంది. ఒక్క వ్యవసాయమే కాదు, అన్నిరంగాల్లోనూ సంక్షోభం తొంగి చూస్తున్నది. ఎడాపెడా హామీలు గుప్పించి జనాలను ఆకర్షించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు చేతులెత్తేయడమే ఇందుకు కారణం. స్వరాష్ట్ర సాధన తర్వాత అంచెలంచెలుగా అభ్యున్నతి సాధించిన తెలంగాణలో మరింత మెరుగైన 'మార్పు' వస్తుందని ఆశించిన సామాన్యులకు పరిస్థితి నానాటికీ దిగజారి పోతుండటం బెంబేలెత్తిస్తున్నది. ఆశలుడిగిన తెలంగాణలో రోజురోజుకు రైతుల ఆత్మహత్యలు పెరుగుతుండటం బాధాకరం.

వర్షాభావ పరిస్థితుల వల్ల, సర్కారు నిర్వహణ వైఫల్యం వల్ల రాష్ట్రంలో అనధికారిక అంచనాల ప్రకారం 15 లక్షల ఎకరాల్లో రూ.3,000 కోట్ల విలువైన పంటనష్టం జరిగింది. సకాలంలో వ్యవసాయానికి నీరు అందకపోవడమే ఇందుకు కారణం. ప్రాజెక్టులను నింపి నీళ్లు విడుదల చేసే పనికి రకరకాల సాకులతో కాంగ్రెస్ తిలోదకాలు ఇచ్చింది. నీళ్లను రాజకీయం చేసింది. దాంతో కాంగ్రెస్ పాలనలో సగటున రోజుకు ఇద్దరు రైతులు మృతి చెందుతున్నట్టు లెక్కలు తెలుస్తున్నాయి. ఇప్పటివరకు 209 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని బీఆర్ఎస్ వెల్లడిస్తున్నది. కాగా, అసలు రైతులెవరూ ఆత్మహత్య చేసుకోలేదని మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. అంతకుముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చనిపోయిన రైతుల వివరాలు తెలియజేస్తే పరిహారం ఇస్తామని వెటకారం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎంతో కొంత భుక్తికి మార్గం పొందిన సిరిసిల్ల మరోసారి ఉరిసిల్లగా మారుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. చేతిలో పని లేక కుటుంబాలను పోషించుకునే దారి లేక అనేకమంది నేతన్నలు మృత్యువునే మార్గంగా ఎంచుకుంటున్నారని తెలుస్తున్నది. కానీ, ప్రభుత్వం వీటిని గుర్తించడం లేదు. ఇక మహబూబ్‌నగర్ జిల్లాలో రైతు ఆత్మహత్యను కూడా మసిబూసి మారేడు కాయ చేసే ప్రయత్నాలు జరిగాయి. ఇవన్నీ ప్రజల సమస్యలను గుర్తించడానికి కాంగ్రెస్ తిరస్కార ధోరణిని పట్టి చూపిస్తున్నాయి.

'తాంబూలాలు ఇచ్చేశాం తన్నుకుచావండి' అన్న ధోరణిలో హామీలు ఇవ్వడం, ఆ తర్వాత వాటిని ఎగ్గొట్టడం కాంగ్రెస్‌కు మొదటి నుంచీ అలవాటే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన 420 హామీలు కూడా ఈ కోవకు చెందినవే. ఇప్పుడు తాజాగా పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మరిన్ని హామీలతో కాంగ్రెస్ నిస్సిగ్గుగా మరోసారి ముందుకువస్తున్నది. పెట్టుబడి సాయాన్ని సమకూరుస్తూ వ్యవసాయానికి అండదండలు అందించే రైతుబంధులాంటి పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇది ప్రభుత్వ కనీస బాధ్యత. తద్వారా రాష్ట్ర ప్రజలకు ఎంతో కొంత ఉపశమనం కలుగుతుందనడంలో సందేహం లేదు. కానీ రాష్ట్రంలో ఆ దిశగా అడుగులు పడడం లేదు. పరిస్థితులను, పరిణామాలను గమనిస్తే తెలంగాణ వ్యవసాయరంగంలో 2014 ముందటి సంక్షోభం తలెత్తే ప్రమాదం కనిపిస్తున్నది.

# ఉక్కు సంకల్పం X తుక్కు సంకల్పం



ఇంగ్లీష్ రమేశ్
90630 92644

**కొట్లాడి ఒక రాష్ట్రాన్ని తీసుకురావడం అసాధ్యం. కానీ, కొట్లాడితే మళ్లీ అధికారంలోకి రావడం చాలా చిన్న విషయం. ఇప్పుడు కాకుంటే ఇంకో నాలుగు రోజులకైనా కచ్చితంగా వచ్చే అవకాశం ఉన్న అధికారం కోసం ఎవ్వరైనా కొట్లాడుతారు. కానీ, ఎప్పుడొస్తదో తెల్వని ఒక రాష్ట్రం కోసం, అసలు వస్తదో లేదో కూడా తెల్వని రాష్ట్రం కోసం, ఎంతకాలం కొట్లాడాలో కూడా తెల్వని లక్ష్యం కోసం, తెగించి నిలబడి కొట్లాడాలంటే మాత్రం అతను కేవలం నాయకుడు ఐతే సరిపోదు, ఒక మహా నాయకుడు అయ్యుండాలి. లక్ష్యం కోసం పదవులను మాత్రమే కాదు, తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టగలిగే దమ్మున్న యోధులు మాత్రమే తాము పెట్టుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారు. అలాంటి అసాధ్యమైన లక్ష్యమే తెలంగాణ, ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన యోధుడే కేసీఆర్.**

ఆనాడు పదవులు వదులుకోవటానికే భయపడి పారిపోయినోళ్లంతా తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టి కొట్లాడిన కేసీఆర్‌ను పట్టుకుని ఒక్క ఓటమితో అతని పనయిపోయిందని మాట్లాడుతున్నారు. ఆ రోజు 'జై తెలంగాణ' అని నినదించడానికే భయపడి చచ్చినోళ్లు, ఆ తెలంగాణ రాష్ట్రాన్నే సాధించిన కేసీఆర్ కొట్లాడే శక్తిని అవహేళన చేస్తున్నారు. ఈ దేశపు మ్యాప్‌లోనే లేని రాష్ట్రాన్ని తెచ్చిన వ్యక్తి కేసీఆర్. అలాంటి కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తామని బహిరంగంగా చెప్తున్నారు.

మీరంతా పదవుల కోసం కొట్లాడేటోళ్లయితే, అతను కొట్లాడటం కోసమే పదవులు వదులుకున్న నాయకుడు. అలాంటి మనిషి ఒక్కసారి పదవి పోతే నిరాశపడుతడా? ఒక్కడు కూడా లేనినాడే ఆయన ఒక్కడే ఈ రాష్ట్రం కోసం పిడికిలెత్తిండు, ఆ పిడికిలి నీడలో కొన్ని లక్షల పిడికిళ్లు, కోటి గొంతుకలై గర్జిస్తే ఒక రాష్ట్రమే వచ్చింది. ఒక్కడిగా మొదలై ఆకాశమంత ఎదిగిన మనిషి నుంచి నలుగురిని లాక్కుంటే అతను బలహీనపడిపోతాడని ఎలా అనుకుంటున్నారు? అతనికి ప్రతిపక్షం కొత్త కాదు, కొట్లాడటం కొత్త కాదు, ఒక్కడిగా మొదలైన కేసీఆర్‌తోనే ఈ రాష్ట్రం వచ్చింది. అది కూడా కేసీఆర్ ప్రతిపక్షంలో ఉండి కొట్లాడినపుడే ఈ రాష్ట్రం వచ్చింది. అందుకే సమూహంగా ఉండే కేసీఆర్ కంటే, ఒక్కడిగా ఉండే కేసీఆర్ చాలా శక్తిమంతుడు. అధికారంలో ఉండే కేసీఆర్ కంటే, ప్రతిపక్షంలో ఉండే కేసీఆర్ చాలా బలవంతుడు. మహా సముద్రాలను అవలీలగా ఈదుకుంటూ వచ్చిన కేసీఆర్ ముంగట పిల్ల కాలువలు తొడకొడుతూ అతని పని ఖతం చేస్తామంటుంటే ఎలా నవ్వాలో కూడా అర్థం కాని పరిస్థితి.

40 వేల చెరువులను నింపిన ఒక మహా ఆత్మస్థైర్యాన్ని, ఈ చెరువులను మూడు నెలల్లోనే ఎండగొట్టిన వాళ్లు బద్దలుకొడుతాం అంటుంటే నవ్వురాకపోతే ఇంకేం వొస్తుంది? ముగ్గురు ముఖ్యమంత్రులు మారితే తప్ప ఒక్క ప్రాజెక్టును పూర్తిచేయటం చాతకానివాళ్లు, కేవలం మూడే మూడేండ్లలో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించి, మొత్తం తెలంగాణ రాష్ట్రాన్ని పచ్చని మాగాణంగా మార్చి, దేశంలోనే వరి ఎక్కువగా పండించే రెండో రాష్ట్రంగా తీర్చిదిద్దిన కేసీఆర్ సంకల్పాన్ని వీళ్లు చెదరగొడుతాం అంటుంటే కామెడీ కాకపోతే ఇంకేం అవుతుంది?



కుంగిపోయిన రెండు పిల్లర్లను బూచిగా చూపెట్టి మొత్తం కాళేశ్వరమే ఒక వృథా ప్రాజెక్టు అని బురదజల్లిన వీళ్లు, అదే కేసీఆర్ రైతుల దగ్గరికి వస్తున్నాడని తెలియగానే రాత్రికి రాత్రి అదే కాళేశ్వరం నీళ్లను దొంగచాటుగా ఎత్తిపోస్తున్న వీళ్లు కేసీఆర్‌ను మానసికంగా క్రుంగిపోయేలా చేస్తామంటుంటే ఎవరైనా పగలబడి నవ్వకుండా ఎలా ఉంటారు? లక్షల కిలోమీటర్ల పైప్‌లైన్‌తో ఇంటింటికీ నీళ్లిచ్చి రోడ్ల మీద ఒక్క బిందె కూడా కనపడకుండా చేసిన కేసీఆర్ ధైర్యాన్ని, మూడే మూడు నెలల్లో ట్యాంకర్లు కొనుక్కునే స్థాయికి దిగజార్చిన వాళ్లు చెదరగొడుదామని సవాళ్లు విసురుతుంటే వీళ్ల హాస్య చతురతను మెచ్చుకోకుండా ఎలా ఉండగలం? దేశంలో ఎక్కడా లేనివిధంగా 24 గంటల కరెంటు ఇచ్చిన ఉక్కు సంకల్పం కేసీఆర్ అయితే, మూడు నెలల్లోనే కరెంట్ కోతలతో మళ్లా జనరేటర్ల కాలం తెచ్చిన తుక్కు సంకల్పం వీళ్లది. కేసీఆర్‌ను ఆపటం వీళ్లతోని ఐతదా? 11 సార్లు సరిగ్గా దున్నకాల టైంకి టంగ్‌టంగ్‌మని రైతుబంధు వేసిన కమిటెడ్ లీడర్ కేసీఆర్ అయితే, ఒక్క రైతుబంధు కూడా సక్కగ ఇయ్యకుండా కథలుపడ్తున్న వీళ్లు కేసీఆర్ పని ఖతం చేస్తారా? ఇంటికి పెద్ద దిక్కు ఐన రైతు కూలిపోతే దినవారం లోపు రూ.5 ఇచ్చి ఆ కుటుంబానికి అండగా నిలబడిన పెద్ద దిక్కు కేసీఆర్ ఐతే, అసలు రైతుబీమా ముచ్చట కూడా ఎత్తకుండా, రైతు ఆత్మహత్యల కాలం మళ్లా తెచ్చిందే కాక, ఆ ఆత్మహత్యలను హేళన చేస్తున్న వీళ్లు కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తారా? అరువై ఏండ్లుగా నల్లగొండకు మంచినీళ్లు ఇవ్వలేకపోయిన వాళ్లు, ఫ్లోరైడ్ బండని బద్దలుకొట్టి శాశ్వతంగా మంచి నీటి సమస్యను పరిష్కరించిన కేసీఆర్ చరిత్రను చెరిపేస్తామంటే ఆ బండరాళ్లు సైతం పగలబడి నవ్వుతాయి. అద్దంలా మెరిసిపోతున్న పల్లెటూర్లు, మండుటెండల్లో అలుగులు దుంకుతున్న చెరువులు, గొర్రెలు, చేపలు, ఈత వనాలతో మళ్లీ ప్రాణం పోసుకున్న కులవృత్తులు, గురుకులాలు, మెడికల్ కాలేజీలు, ఐటీ హబ్‌లు, పెట్టుబడులు, మారుమూల ఊర్లల్లో సైతం కోట్లల్లో పెరిగిన భూముల ధరలు, పెరిగిన సాగు, పెరిగిన పంట విస్తీర్ణం, పెరిగిన భూగర్భ జలాలు, పెరిగిన తలసరి ఆదాయం, తగ్గిపోయిన వలసలు, బాల్య వివాహాలు, మాతా శిశు మరణాలు, తగ్గిపోయిన పేదరికం.. ఇవన్నీ కండ్లముందే ఉన్న నిజాలు. ఇట్లా చెప్పుకొంటూ పోతే సవాలక్ష అద్భుతాలు..

మీరు 60 ఏండ్లలో సాధించలేకపోయిన రాష్ట్రాన్ని ఒక వ్యక్తి కేవలం పద్నాలుగేండ్లలోనే సాధించాడు. అంటే మీరు 60 ఏండ్లలో చేయలేకపోయిన అభివృద్ధిని అతను కేవలం తొమ్మిదిన్నరేండ్లలోనే నిజం చేసి చూపెట్టిండు. అంటే, ఆ మనిషి సంకల్పం ఎంత గొప్పదో మీకు అర్థం అయ్యుండాలి. ఆ మనిషి ఆత్మస్థైర్యాన్ని ఆ దేవుడు కూడా తగ్గించలేడనే విషయాన్ని మీరు బుర్రలోకి ఎక్కించుకుని ఉండాలి. కేవలం ఒక్క శాతం ఓట్లతోనే కేసీఆర్ ఓడిపోయిండనే నిజం మీ మైండ్‌లోకి ఎక్కించుకోవాలి. ఇదంతా ఎందుకంటే దేశంలో ఎక్కడా లేని సంక్షేమం ప్రతీ ఇంటికీ అద్భుతంగా అందుతున్నా, దేశంలో ఎక్కడా కనిపించని అభివృద్ధి తెలంగాణలో కండ్లముందే కనిపిస్తున్నా, జనాలు మీరు ప్రచారం చేసిన అబద్ధాలను నమ్మిన్రు. మీరు ఇచ్చిన హామీలను నమ్మిన్రు. కానీ, మీ మాటలు అన్నీ అబద్ధాలే అనీ, మీరు చేసిందంతా మాయేననే విషయం జనాలకు అర్థం కావటానికి ఎంతో టైం పట్టదు. ఇయ్యాళ ఎండిపోతున్న ప్రతీ పొలం, ఆడుగంటిపోతున్న ప్రతీ చెరువు మళ్లీ కేసీఆర్‌ను జనాలకు గుర్తుచేస్తాయి. ఎండకాలం రాకముందే మొదలైన కరెంటు కోతలు, 24 గంటలు కరెంటు ఇచ్చిన కేసీఆర్‌ను మళ్లీ గుర్తుచేస్తాయి. ఇలా మీరు తప్పే ప్రతీ మాటా, మాట ఇవ్వకపోయినా ఎన్నో పథకాలు ఇచ్చిన కేసీఆర్‌ను చాలా బలంగా జనాలకు గుర్తు చేస్తాయి. ఇలా మీరు వేసే ప్రతీ తప్పటడుగూ, మీ అసమర్థత, మీరు చేసే తప్పులు, ఇవన్నీ కేసీఆర్ మీద జనాల్లో మీరు సృష్టించిన భ్రమలను తొలగించి వాళ్లకు నిజాలను చూపిస్తాయి. అందుకే మీరు కేసీఆర్‌నో, అతని పార్టీనో ఖతం చేసే పనులు మానేశి, మీరిచ్చిన హామీలు నెరవేర్చడం మీద మాత్రమే దృష్టిపెట్టడం మంచిది.

నాలుగు పిట్టలు ఎగిరిపోతే, ఒక మహావృక్షం కూలిపోతదా? నాలుగు కొమ్మలు విరిగిపోతే, అడవి అంతం ఐపోతదా? ఆయన తెచ్చిన రాష్ట్రానికి మీలాంటి ముఖ్యమంత్రులు వస్తారు, పోతారు. కానీ, ఆయన ఆకాశం, తెలంగాణ ఉన్నంతవరకూ ఉంటాడు. నలుగుర్ని గుంజుకుంటే అతని పని ఐపోతదనుకుంటే అది మీ మూర్ఖత్వమే అవుతుంది. ఈ రాష్ట్రాన్నే తయారుచేసిన నాయకుడు అతను. లీడర్లను తయారుచేయడం అతనికి పెద్ద విషయం కాదు. అతను కింద పడ్డాడని మీరు హేళన చేస్తున్నారు. కానీ, మీకు అర్థం కాని విషయం ఏమంటే అతను రెండు కాళ్ల మీద నిలబడి కొట్లాడినపుడే ఈ రాష్ట్రం తెచ్చిండు. అతను ఇప్పుడు మూడు కాళ్ల కేసీఆర్, ఇప్పుడు తెలంగాణ ఆగం కాకుండా ఉండటం కోసం మూడు కాళ్ల మీద నిలబడి కొట్లాడుతున్నాడు.

**కేసీఆర్ ఆలోచనలు, కేసీఆర్ తెలివి, అతని వ్యూహాలు, అతని సంకల్పం, అతని శక్తి... ఇవి తెలిసినవాళ్లెవరూ కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేసే ఆలోచన కలలో కూడా చెయ్యరు. తెలంగాణ అనేది మీకు రాష్ట్రం మాత్రమే కావొచ్చు, కానీ, తెలంగాణ అనేది కేసీఆర్ ప్రాణం. తెలంగాణ తెచ్చుడు కోసమే కాదు, ఆ తెలంగాణ ఆగం కాకుండా ఉండటం కోసం సైతం తన ప్రాణం పెట్టి కొట్లాడటం కేసీఆర్‌కు ఉద్యమం నేర్పిన విద్య. ఇందులో ఏ మాత్రం సంశయం అక్కర్లేదు.**

**'కుండ ఊడ్చేసినా.. బాయి తోడేసినా బర్కత్ కరువు' అని తెలంగాణలో ఓ సామెత. గిన్నెలో బువ్వను, బాయిలో నీళ్లను ఒక్కసారే కాకుండా, రేపటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని పొదుపుగా వినియోగించుకోవాలని దీని సారాంశం. ప్రస్తుతం రాష్ట్రంలోని జలవనరులను చూస్తే ఇదే సామెత గుర్తొస్తున్నది. పదేండ్లుగా నీటితో కళకళలాడిన ప్రాజెక్టులు, కాలువలు ఒక్కసారిగా కళతప్పాయి. మండుటెండల్లో మత్తళ్లు దుంకిన చెరువులు, చెక్‌డ్యాంలు నేడు నెర్రెలు బారాయి. ఫలితంగా సాగునీళ్లు కరువై రాష్ట్రంలో దాదాపు 20 లక్షల ఎకరాల్లో యాసంగి పంట ఎండిపోయింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో 10 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయే ప్రమాదం ఉన్నది.**

# ఎండని చేనేది.. ఏడ్వని రైతేడి?



మారెడ్డి సంజీవకుమార్
91827 77465

కండ్ల ముందు ఎండుతున్న పంటలను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రాజెక్టుల గేట్లు ఎత్తాలని రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారు. రైతులను కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం పార్టీ గేట్లు ఎత్తామని రాజకీయాల్లో మునిగి తేలుతున్నది. కరువు పరిస్థితులకు పరిష్కారాలు చూపాల్సిందిపోయి కారణాలు వెతికే పనిలో బిజీ అయిపోయింది. వానలు పడలేదని ఒకసారి, చలికాలంలో అధికారంలోకి వచ్చామని మరోసారి చెప్తూ చేతులెత్తేసే ప్రయత్నం చేస్తున్నది.

రాష్ట్రంలో కురిసిన వర్షాలను ఒకసారి పరిశీలిస్తే.. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) ప్రకారం.. నిరుడు నైరుతి రుతుపవనాల కారణంగా 17 శాతం అధికంగా వానలు కురిశాయి. రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 73.8 సెంటీమీటర్లు కాగా, నిరుడు జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య 86.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొత్తం 33 జిల్లాలకు గాను 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా, 18 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైనట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాల వారీగా చూస్తే సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాలో సాధారణం కన్నా 45 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఖమ్మం జిల్లాలో మాత్రం 16 శాతం లోటు నమోదైంది. మొత్తంగా 5 జిల్లాల్లోనే సగటున 11 శాతం మేర లోటు వర్షపాతం కనిపించింది. అలాగే నిరుడు జూన్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 7 వరకు లెక్కించినా రాష్ట్రంలో సాధారణ వర్షపాతం కన్నా ఎక్కువే నమోదైందని గణాంకాలు చెప్తున్నాయి. ఈ కాలంలో సాధారణ వర్షపాతం 86.6 సెంటీమీటర్లు కాగా, 91. 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంటే సాధారణం కంటే 5 శాతం అధికం. మొత్తంగా జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ మినహా మిగతా 31 జిల్లాల్లో సాధారణం లేదా అంతకన్నా ఎక్కువ వర్షాలు పడినట్టు నివేదిక స్పష్టం చేస్తున్నది. ఇందులో 6 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఇలా వానలు పడినప్పుడు వరద ప్రవాహాన్ని సముద్రం పాలు కాకుండా ఒడిసిపట్టుకున్న పాలకులే ప్రజలను సుభిక్షంగా పాలించగలుగుతారు.

కాకతీయులు గొలుసుకట్టు చెరువుల ద్వారా నీటి నిల్వలను కాపాడి ప్రజల మన్ననలు పొందగలిగారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ కూడా మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ చేసి, ప్రాజెక్టులను నిర్మించి వరద నీటిని ఒడిసి పట్టగలిగారు. ఇలా ఒడిసిపట్టిన నీటిని పక్కా ప్రణాళికతో పొదుపుగా వినియోగిస్తేనే పచ్చని పంటలు పండుతాయి. పదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదే అనుసరించింది. 'టెయిల్ టు ఎండ్' విధానాన్ని అనుసరించి ప్రాజెక్టుల్లో నీటిని విడుదల చేసింది. ఫలితంగా చివరి ఆయకట్టుకు నీరంది, ఒక్క ఎకరా కూడా ఎండిపోలేదు. పైగా భూమికి బరువయ్యేంత పంట దిగుబడి వచ్చింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ నీటి ప్రణాళికనే గతి తప్పింది. పాలకుల అవగాహన రాహిత్యానికి అధికారుల నిర్లక్ష్యం తోడవడంతో రైతులు నట్టేట మునిగారు. నీటి ప్రణాళికను అనుసరించకుండా పైరవీల ద్వారా ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేసే దుస్థితి నెలకొన్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి ఎస్సారెస్పీలో 78.66 టీఎంసీలు, మిడ్‌మానేరులో 23 టీఎంసీలు, ఎల్‌ఎండీలో 19.42 టీఎంసీలు, ఎల్లంపల్లిలో 16.03 టీఎంసీలు, సింగూరులో 25.81 టీఎంసీలు, నిజాంసాగర్‌లో 16.16 టీఎంసీలు, కడెంలో 4.3 టీఎంసీలు, శ్రీశైలంలో 57టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో 157 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నది. ఈ నీటిని సరైన ప్రణాళికతో సద్వినియోగం చేసుకుంటే ఈ రోజు కరువు పరిస్థితి ఉండేది కాదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల వ్యవధిలోనే, అంటే 2023 డిసెంబర్ 13న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో అన్ని డిస్ట్రిబ్యూటరీ కాలువలకు నీటిని విడుదల చేసేందుకు నీటి పారుదల శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఆ సమయానికి ప్రాజెక్టులో 77.43 టీఎంసీల నీరున్నది. నీటి లభ్యతను బట్టి దాదాపు 94 డిస్ట్రిబ్యూటరీలకు 64.18 టీఎంసీల నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. నీటి విడుదలకు డీ1 నుంచి డీ 53 వరకు జోన్-1గా, డీ 54 నుంచి డీ 94 వరకు జోన్-2గా నిర్ణయించుకున్నారు. జోన్-1కు 3,500 క్యూసెక్కుల చొప్పున 7 సార్లు, జోన్-2కు 5,500 క్యూసెక్కుల చొప్పున 8 సార్లు సీజన్ మొత్తంలో 105 రోజులు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. జోన్-1 పరిధిలో డిసెంబర్ 18న, జోన్-2 పరిధిలో డిసెంబర్ 25న నీటిని విడుదల చేసిన అధికారులు... ఒక్కో జోన్‌కు 7 విడతల్లో ఏప్రిల్ 6 వరకు నీటిని విడుదల చేయాలని ప్రణాళిక రూపొందించారు. కానీ కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి షెడ్యూల్‌కు ముందే నీటిని ఖాళీ చేశారు. ఫలితంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో చివరి ఆయకట్టుకు నీరందక వేలాది ఎకరాల పంట ఎండిపోయి, రైతులు పశువులను మేపుకొంటున్నారు.



**రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీళ్లున్నా.. ప్రణాళిక గతి తప్పి నీటి వృథాతోనే ఎక్కువ నష్టం జరిగింది. కర్ణాటకలో నీటిని వృథా చేస్తే ప్రజలకు రూ.5 వేల జరిమానా విధిస్తున్న ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇక్కడ 50 టీఎంసీల నీరు సముద్రం పాలు కావడానికి బాధ్యులెవరో చెప్పాలి. అలాగే బక్క పలుచని కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొనేందుకు బక్క రైతులను బలిపీఠం ఎక్కిస్తున్న కాంగ్రెస్ కుట్రలను కూడా ప్రజలు గమనించాలి. సాక్షాత్తు నీటి పారుదల శాఖ మంత్రి సొంత జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నీటి వినియోగానికి అవకాశం ఉన్నా ప్రభుత్వం పంటలకు నీళ్లివ్వలేదు.**

ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా ఉన్నన్ని రోజులు 'పెద్ద నీరటి'గా వ్యవహరిస్తూ రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్న కేసీఆర్.. ప్రతిపక్షనాయకుడిగా మరోసారి రైతులకు బాసటగా నిలిచారు. కాంగ్రెస్ కుట్రలను తిప్పికొడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా వేదికగా రైతు ఉద్యమానికి పిలుపునివ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చింది. కేసీఆర్ పర్యటించిన 24 గంటల్లోనే నాగార్జునసాగర్ ఎడమ కాల్వ గేట్లు తెరుచుకున్నాయి. తన తదుపరి పర్యటన కరీంనగర్‌కే అని చెప్పిన కొద్ది గంటల్లోనే పనికిరాదన్న కాళేశ్వరంలో బాహుబలి మోటర్లు గర్జించాయి. ఎస్సారెస్పీ వరద కాల్వలోకి జలాలు ఉప్పొంగాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మల్లన్నసాగర్‌లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. మల్లన్నసాగర్ ప్రాజెక్టులో నీళ్లున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పంటలకు నీళ్లివ్వలేదు. రైతులతో కలిసి మల్లన్నసాగర్‌ను ముట్టడిస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చిన రెండు గంటల్లోనే కూడవెల్లి వాగులోకి మల్లన్నసాగర్ నుంచి 800 క్యూసెక్కుల నీరు విడుదలైంది. నీటి వినియోగంపై కనీస అవగాహన లేని ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎండని చేను లేదు.. ఏడ్వని రైతు లేడంటే అతిశయోక్తి కాదు. అందుకే ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని రాష్ట్ర రైతాంగం మండిపడుతున్నది.

## క్రోధి కోరిక



క్రోధి నామ వత్సరం
తెలుగు కొత్త వత్సరం
ఖాయముగా మాయజేయు
మనుషుల మద మత్సరం

వేప కొసల వెండి పూత
తీయని కోయిల కూత
పులుపు, వగరు కలయిక గల
మామిడి పిందెల కాత
పంచాంగపు శ్రవణాలతో
గుడి గంటల మోత

ఆరు రుతువులకు రాజు
ఈ ఉగాది ఆమని
ప్రకృతికే కొత్త కాంతి మన
వసంత యామిని

తీపీ, పులుపూ, ఉప్పూ
చేదు, వగరు, కారం
అను ఆరురుచులు
నిత్యపు జీవనాన అనివార్యం

శిశిరం ఆకులు రాల్చిన
చెట్టెప్పుడు కుంగదు
చివురు వేయు చేవ ఉన్న
వసంతమెపుడు పొంగదు

మండుటెండలతో గ్రీష్మం అహం హుంకరించినా
వర్షరుతువు స్వాగతింప చల్లబడుట మానదు
శరన్మేఘ మాలిక వలె హేమంతపు చలిమంటలు
కాలపు సహకారంతో పండును బతుకుల పంటలు


వైవిధ్యపు భారత రథ రుతుచక్ర భ్రమణం
మనసును ఇరుసుగ మార్చెడి మనజీవన గమనం

రుచులు ఆరు రుతువులారు
ఉగాది ఏమని కోరు?
మంచి పెంచి పంచడమే మన మనుగడ తీరు

భిన్నత్వపు ఏకత్వం భారతీయ తత్వం
వైవిధ్యపు గమనమే
అసలగు జీవన సత్యం
కులాల కుడ్యము దాటి
గుణమును గౌరవించుదాం
మతాల మౌఢ్యం లేని
మానవతను పంచుదాం
శ్రీ క్రోధి నామ ఉగాదిని
ఊపిరెత్తి పిలుద్దాం
తెలుపు మనసు తెలుగులమై
'నిషాన'గా నిలుద్దాం...



మడిపల్లి దక్షిణామూర్తి
98662 77107




## అవి మీ జేబు సంస్థలు!

ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ భారత్‌ను జైలులా మార్చేసింది. మోదీజీ! ఎన్ఐఏ, ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు మీ జేబుల్లోనే ఉన్నాయి. ఎన్ఐఏ, సీబీఐలు బీజేపీకి సోదరులు. ఇన్‌కమ్ ట్యాక్స్, ఈడీ ట్యాక్స్‌లు బీజేపీకి నిధులు సేకరించే బాక్సులు.

— **మమతాబెనర్జీ**, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి

